సాక్షి
ప్రకాశం
బుధవారం । 9 । ఆగస్టు । 2023



ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు నిండాయని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. - 8లో..



దమ్ముంటే చర్చకు రండి

జిల్లాలో అభివృద్ధిపై దమ్ముంటే చర్చకు రావాలని చంద్రబాబు, లోకేష్‌లకు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు సవాల్ విసిరారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
37/30

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: స్థానిక జవహర్ నవోదయలో 2024-25 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయ సమితి ప్రిన్సిపాల్ యం.సుబ్రహ్మణ్యేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలు, చీరాల, కందుకూరు, అద్దంకి, వేటపాలెం, గుడ్లూరు, వలేటివారిపాలెం, పొన్నలూరు, లింగసముద్రం, సింగరాయకొండ, ఉలవపాడు, టంగుటూరు, జరుగుమల్లి, కొండపి, చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు, కొత్తపట్నం, సంతమాగులూరు, కొరిశపాడు, జె.పంగులూరు, మార్టూరు, యద్దనపూడి, బల్లికురవ, పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం మండలాల నుంచి మాత్రమే ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న వారు దరఖాస్తు చేసుకోవాలి. డౌన్‌లోడ్ చేసుకున్న దరఖాస్తు ఫారాలను 5వ తరగతి చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయునిచే ధ్రువపరిచి ఆన్‌లైన్‌లో మాత్రమే ఉచితంగా అప్‌లోడ్ చేయాలన్నారు. 2021-22 సంవత్సరంలో 3వ తరగతి, 2022-23 సంవత్సరంలో 4వ తరగతి ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి ఉండాలన్నారు. అప్‌లోడ్ చేసేందుకు ఈనెల 10వ తేదీ తుది గడువు అన్నారు. ప్రవేశ పరీక్ష 2024 జనవరి 20వ తేదీ ఉదయం 11.45 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందని చెప్పారు. పూర్తి వివరాలకు నవోదయ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

29న క్రీడాకారులకు సత్కారం

ఒంగోలు: ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 29న స్థానిక పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడా ప్రతిభా అవార్డుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీఎస్ సుబ్బారావు, కె.వనజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరం స్కూల్‌గేమ్స్‌లో జాతీయ, అంతర్ జిల్లా, జోనల్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులు తమ వివరాలను, సంబంధిత పత్రాలను ఈనెల16వ తేదీ లోపు పీవీఆర్ బాయిస్ హైస్కూల్ పీడీ వెంకటేశ్వరరావుకు అందించాలన్నారు. ధ్యాన్‌చంద్ జయంతి రోజున సంబంధిత అవార్డులు అందిస్తారన్నారు.

దూరప్రాంతాలకు తక్కువ ఖర్చుతో సౌకర్యవంతంగా ప్రయాణించేందుకు రైల్వేలు అనుకూలంగా ఉంటాయి. జిల్లాలోని ప్రధానమైన రైల్వేస్టేషన్లలో మరిన్ని మౌలిక వసతులు కల్పించి ప్రయాణికుల ఇక్కట్లు తొలగించేందుకు 'అమృత్ భారత్ స్టేషన్' పథకం వరంగా మారింది. ఒంగోలు, సింగరాయకొండ, దొనకొండ రైల్వేస్టేషన్లను రూ.62.53 కోట్లతో అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. సకాలంలో పనులు పూర్తయితే ఈ రైల్వేస్టేషన్లు కొత్త రూపు సంతరించుకోనున్నాయి.



ఆధునీకరణ తరువాత సింగరాయకొండ రైల్వేస్టేషన్ ఊహా చిత్రం

ఇక రైల్వేస్టేషన్లు సరి కొత్తగా..

- కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ
- జిల్లాలో ఒంగోలు, సింగరాయకొండ, దొనకొండ స్టేషన్ల అభివృద్ధి
- మూడు స్టేషన్ల అభివృద్ధికి రూ.62.53 కోట్లు కేటాయింపు
- స్టేషన్లలో ఆధునిక వసతుల కల్పన
- ఈనెల 6న వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ





ఒంగోలు రైల్వే స్టేషన్

సింగరాయకొండ: కేంద్ర ప్రభుత్వం రైల్వేస్టేషన్ల అభివృద్ధిపై దృష్టి సారించి సుఖవంతమైన ప్రయాణం కోసం ప్రయాణికులకు అదనపు వసతుల కల్పనే లక్ష్యంగా శ్రీకారం చుట్టింది. నూతనంగా అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా రైల్వే స్టేషన్ల ఆధునికీకరణలో భాగంగా జాతీయ స్థాయిలో మొదటి విడతగా 508 స్టేషన్లను అభివృద్ధి చేస్తుండగా జిల్లా స్థాయిలో ఒంగోలు, సింగరాయకొండ, దొనకొండ రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేయనుంది. ఇందుకోసం ఒంగోలుకు రూ.19.10 కోట్లు, దొనకొండకు రూ.18.30 కోట్లు, అత్యధికంగా సింగరాయకొండకు రూ.25.13 కోట్లు కేటాయించింది. ఈ అభివృద్ధి పనులకు ఈనెల 6వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్వయంగా వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు.

ఒక్కో స్టేషన్‌కు ఒక్కో చరిత్ర:

ఒంగోలు స్టేషన్ జిల్లా కేంద్రంలో ఉంది. ఈ స్టేషన్ ఎప్పుడూ ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ఈ స్టేషన్ ద్వారా మార్కాపురం, కనిగిరి, అద్దంకి వంటి దూరప్రాంతాల మండలాల నుంచి ప్రజలు మహారాష్ట్ర, కర్ణాటక, ఒడిశా, పశ్చిమ బెంగాల్, కేరళ వంటి రాష్ట్రాలకు వెళ్తుంటారు. ప్రతి రోజు 74 రైళ్లు ఆగుతుండగా, వేలాదిమంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు.

■ సింగరాయకొండ రైల్వేస్టేషన్ కొండపి, కందుకూరు, కనిగిరి నియోజకవర్గాలకు ముఖద్వారంగా ఉంది. ఈ స్టేషన్ నుంచి ప్రతిరోజు సుమారు 2 వేల మందికి పైగా ప్రయాణిస్తుంటారు. ఈ స్టేషన్ ద్వారా సంవత్సరానికి సుమారు రూ.6 కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. ఈ స్టేషన్ నుంచి బెంగళూరు, విశాఖపట్నం, హైదరాబాద్, ఒడిశా, కేరళ ప్రాంతాలకు ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. వాణిజ్యపరంగా కూడా ఇతర రాష్ట్రాలకు చేపలు సరఫరా అవుతాయి.

■ దొనకొండ రైల్వేస్టేషన్ 25 సంవత్సరాల క్రితం లోకో రైల్వేస్టేషన్‌గా గుర్తింపు సాధించింది. బొగ్గు రైల్వే ఇంజన్ల కాలంలో ఇక్కడ లోకో షెడ్ ఉండేది. దూరప్రాంతాల నుంచి వచ్చే రైళ్లకు ఈ స్టేషన్‌లో ఇంజన్ మార్చేవారు. సుమారు 200 మంది రైల్వేసిబ్బంది పనిచేసేవారు. కాలక్రమేణా రైల్వే అభివృద్ధిలో భాగంగా విద్యుత్ ఇంజన్లు రావటం, రైల్వే ట్రాక్‌ను మీటర్ గేజ్ నుంచి బ్రాడ్‌గేజ్‌గా మార్చడంతో ఈ స్టేషన్ లో జంక్షన్ ప్రాధాన్యత తగ్గి లోకో షెడ్‌ను కూడా రద్దు చేశారు. ఈ స్టేషన్ నుంచి కనిగిరి, దర్శి, కొనకనమిట్ల మండలాల నుంచి ప్రయాణికులు అత్యధికంగా ప్రయాణిస్తుంటారు. ఈ స్టేషన్‌లో ప్రస్తుతం పగటిపూట మాత్రమే రైళ్లు ఆగుతున్నాయి. గతంలో రాత్రి, పగలు రైళ్లు ఆగుతుండగా కోవిడ్ కారణంగా రాత్రిపూట రైళ్లను రద్దు చేశారు. గతంలో రాత్రి పూట ఆగే రైళ్లను మళ్లీ పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



దొనకొండ రైల్వేస్టేషన్ ముఖచిత్రం



సింగరాయకొండ రైల్వేస్టేషన్ ముఖ చిత్రం

రైల్వేస్టేషన్‌లలో చేపట్టే అభివృద్ధి పనులు ఇవీ:

■ ఒంగోలు రైల్వే స్టేషన్ పరిధిలోని ప్లాట్‌ఫారాలపై ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా షెడ్‌ల ఏర్పాటు, ప్లాట్‌ఫారాల ఫ్లోరింగ్‌ను ఆధునికీకరించడం, పురుషులు, స్త్రీలు, వికలాంగులకు అనుకూలంగా వేర్వేరుగా ఆధునిక మరుగుదొడ్ల నిర్మాణం, ప్రయాణికులకు ప్రత్యేక వెయిటింగ్ హాలు, ఒక లిఫ్టు, మూడు ఎస్కలేటర్లు, ప్లాట్‌ఫారాలపై లైటింగ్ ఏర్పాటు చేయడం, స్టేషన్ ప్రధానద్వారం, ముందు భాగం గ్రీనరీతో అభివృద్ధి చేస్తారు.

■ సింగరాయకొండ రైల్వేస్టేషన్‌లోని అన్ని ప్లాట్‌ఫారాలపై షెడ్‌ల ఏర్పాటు, ప్లాట్‌ఫారాల ఫ్లోరింగ్‌ను ఆధునికీకరించడం, మహిళలు, పురుషులు, వికలాంగులకు ప్రత్యేకంగా ఆధునిక మరుగుదొడ్లు, ఆధునిక పద్ధతిలో వెయిటింగ్ హాల్, మూడు లిఫ్టుల ఏర్పాటు, అన్ని ప్లాట్‌ఫారాలపై లైటింగ్, స్టేషన్ ముఖ ద్వారం, ముందు పార్కింగ్ ఏరియాను ఆధునికీకరించటంతో పాటు వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పిస్తారు.

■ దొనకొండ రైల్వేస్టేషన్‌లో రైల్వేస్టేషన్ ప్రధాన ముఖద్వారం, దాని ముందు ఉన్న పార్కింగ్ ప్రాంతాన్ని ఆధునికీకరించడం, ప్రయాణికులకు వెయిటింగ్ హాలు, 12 మీటర్ల వెడల్పుతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, అదనపు ప్లాట్‌ఫాం, ప్రయాణికులు కూర్చోవటానికి పార్కు, పురుషులు, స్త్రీలు, వికలాంగులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు, మూడు లిఫ్టులు, రైల్వే సిబ్బందికి విశ్రాంతి భవనాలు, స్టేషన్ చుట్టూ తారురోడ్డు, రైల్వే ఉద్యోగులకు నూతన క్వార్టర్స్ నిర్మాణం, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేస్తారు.

అభివృద్ధి పనులు మంచి పరిణామం



సింగరాయకొండ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయటంతో పాటు మరిన్ని రైళ్లను ఆపితే ప్రయాణికులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ స్టేషన్ నుంచి వైజాగ్, తిరుపతి, చెన్నై వంటి దూర ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాలకు వెళ్లటానికి ఉదయం పూట సరైన రైళ్లు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్లాట్‌ఫారాలపై లిఫ్టులు ఏర్పాటు చేయడం మంచి పరిణామం.

– షేక్ లియాఖత్, కొండపి మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్, సింగరాయకొండ

అదనపు రైళ్లు ఆపాలి



రైల్వేస్టేషన్‌లో ఆధునిక వసతులు ఏర్పాటు చేయడం మంచి పరిణామం. ఈ స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న రెండు ప్లాట్‌ఫారాల మధ్య దూరం ఎక్కువగా ఉంది. దీంతో వృద్ధులు, వికలాంగులు ప్లాట్‌ఫారాలు దాటాలంటే ఇబ్బందులు పడుతున్నారు. లిఫ్టులు ఏర్పాటు చేయడం శుభపరిణామం. రైల్వే స్టేషన్ అభివృద్ధితో పాటు అదనపు రైళ్లు కూడా ఆపితే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుంది. ముఖ్యంగా ప్లాట్‌ఫారాలపై రైలు భోగీల వివరాలు తెలిపే డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలి.

– చిలకపాటి సుధాకరరావు, టీచర్, సింగరాయకొండ

దళిత రైతులు సాధికారత సాధించాలి

- ఆ దిశగా అడుగులు వేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- పెద్ద ఎత్తున భూ పంపిణీ చేసింది వైఎస్సార్
- వ్యవసాయ పెట్టుబడులకు రైతు భరోసా అమలు
- రాష్ట్రంలో ఏ పథకం పోయిందో.. చర్చకు రండి
- మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్



పీఎం-ఏజేవై చెక్కును పంపిణీ చేస్తున్న రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: దళిత రైతులు సాధికారత సాధించాలన్న ఉద్దేశంతో సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని, ఎస్సీలు వ్యవసాయం చేసి పది మందికి అన్నం పెట్టే స్థాయికి తీసుకొచ్చారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మంగళవారం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో ప్రకృతి వ్యవసాయం చేసే దళిత రైతులకు రూ.1 కోటికి పైగా విలువ చేసే విత్తనాలు, ఇతర వ్యవసాయ పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

వైఎస్సార్ పాలనలోనే భూ పంపిణీ:

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా సమైక్యాంధ్ర ప్రదేశ్‌లో అప్పటి సీఎం వైఎస్సార్ గిరిజనులు, దళితులకు పెద్ద ఎత్తున భూ పంపిణీ కార్యక్రమం చేపట్టారని, 7 విడతలుగా 35 లక్షల ఎకరాల అసైన్‌మెంట్ భూమిని పంపిణీ చేసి వారు రైతులుగా ఎదిగేలా చర్యలు తీసుకున్నారని అన్నారు. ఆయన తనయుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 4 అడుగులు ముందుకేసి అసైన్‌మెంట్ భూములకు పరిపూర్ణంగా యాజమాన్య హక్కులు కల్పించారని, వ్యవసాయం చేసుకునేందుకు రైతులు అప్పులు చేసుకోకుండా రైతు భరోసా ద్వారా ఏటా రూ.13,500 అందజేస్తున్నారని, రాష్ట్రంలో ఉన్న లక్షలాది చుక్కల భూములకు సీఎం మోక్షం కల్పించి ఆ భూముల యజమానులకు ఊరట కలిగించారని అన్నారు.

వెలిగొండ, వరికపూడిసెల ప్రాజెక్టులతో బలహీన వర్గాలకు మేలు:

పశ్చిమ ప్రకాశం రైతుల ఆశాజ్యోతి వెలిగొండ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తున్నారని, త్వరలో కృష్ణమ్మ ఈ ప్రాంతంలో పరవళ్లు తొక్కుతుందన్నారు. 62 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుందని అన్నారు. అత్యంత వెనకబడిన పుల్లలచెరువు మండల ప్రజలను ఆదుకునేందుకు వరికపూడిసెల ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని పారించటానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.82 కోట్లు మంజూరు చేశారని అన్నారు. వెలిగొండ పరివాహక ప్రాంతం, పుల్లలచెరువు మండలంలో అత్యధికంగా దళితులు, గిరిజనులు ఉన్నారని, ఆయా ప్రాంతాల్లోని వీరు పెద్ద ఆసాములుగా మారబోతున్నారని అన్నారు.

రాష్ట్రంలో ఏ పథకం పోయిందో.. చర్చకురండి

దళితులకు అన్యాయం జరిగిపోతుందని ప్రతిపక్షాలు గగ్గోలు పెడుతున్నాయని, రాష్ట్రంలో ఏ పథకం పోయిందో చర్చకు రావాలని మంత్రి సురేష్ ఛాలెంజ్ చేశారు. గత టీడీపీ ప్రభుత్వ కాలంలో చంద్రబాబు నాయుడు దళితులను ఏ మాత్రం పట్టించుకోలేదని, దళితులుగా పుట్టాలని ఎవరు అనుకుంటారని సూటి పోటి మాటలతో అవమానపరిచారని ఆయన విమర్శించారు. దళిత రైతులు పెత్తందారి రైతులుగా ఎదగాలని పెద్ద ఎత్తున భూ పంపిణీ చేసింది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కాదా అని ఆయన ప్రశ్నించారు. అనంతరం పీఎం-ఏజేవై పథకం కింద మొదటి విడతగా రూ.24,28,800 విలువచేసే విత్తన కిట్లను నియోజకవర్గంలోని 1012 మంది ప్రకృతి వ్యవసాయం చేసే దళిత రైతులకు మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కె.అర్జున్‌నాయక్, ప్రకృతి వ్యవసాయం డీపీఎం వి.సుభాషిణి, డీఎల్‌డీవో బి.వి.ఎస్.సాయికుమార్, తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి, ఎంపీడీవో వై.వి.నాగేశ్వరప్రసాద్, ఏడీఏ నీరజ, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, మాల వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగంగుంట్ల రవిబాబు, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కె.ఓబులరెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, సర్పంచ్ ఆర్.అరుణాబాయి, పబ్బిశెట్టి శ్రీనివాసులు, దళిత సంఘాల నాయకులు బి.బాలచెన్నయ్య, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

15 లోపు ఐటీ డిడక్షన్ ఎంపిక చేసుకోండి

ఒంగోలు టౌన్: ఐటీ పాత విధానంలో కొనసాగాలనుకునే పెన్షనర్లు ఈ నెల 15 లోపు ఎస్టీఓకు తెలియజేస్తూ లేఖ అందజేయాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.అంకిరెడ్డి, కంచర్ల సుబ్బారావు తెలిపారు. మంగళవారం ఎస్టీఓ రాజ్యలక్ష్మిని కలిసి ఈ విషయం గురించి చర్చించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. సేవింగ్స్‌కు సంబంధించిన కాపీలు కూడా సమర్పించాలని తెలిపారు. ప్రభుత్వం జూలై నెల చివరలో ఇచ్చిన సర్క్యులర్ ప్రకారం పెన్షనర్లకు కూడా ఇన్‌కంట్యాక్స్ డిడక్షన్ చేయనున్నట్లు వెల్లడించారు. పెన్షనర్లు తమకు ఇష్టమైన విధానాన్ని అధికారులకు తెలియజేయాలని కోరారు.

ఆకాశవాణి సేవలు అమూల్యం



'సాక్షి' దినపత్రికను చదువుతున్న మంత్రి సురేష్

మార్కాపురం: సమాచార వ్యవస్థలో ఆకాశవాణి అందిస్తున్న సేవలు అమూల్యమని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మంగళవారం ఆయన మార్కాపురం ఆకాశవాణి కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తాను సివిల్ సర్వీసెస్ అధికారిగా ఎంపిక కావటానికి అప్పట్లో ఆకాశవాణిలో వచ్చే తెలుగు, ఇంగ్లిష్ వార్తలతో పాటు స్పాట్‌లైట్, కరెంట్ ఎఫైర్స్ ఉపయోగపడ్డాయన్నారు. సమాచార వ్యవస్థలో మార్పులు వస్తున్నా అందుకు తగినట్లుగా ప్రసారభారతి అధికారులు కూడా ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించుకుని ప్రపంచవ్యాప్తంగా నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుని ఎప్పటికప్పుడు శ్రోతలకు అందిస్తున్నారన్నారు. సెల్‌ఫోన్, టీవీ చానల్స్, సోషల్ మీడియా ఉన్నా ఎఫ్ఎం కేంద్రాలు రావటం వలన రేడియో ప్రాముఖ్యత ఏమాత్రం తగ్గటం లేదన్నారు. ప్రజలలో పఠనాసక్తి తగ్గినా రేడియో ప్రసారాలు మాత్రం వినాలన్నారు. సెల్‌ఫోన్‌లలో న్యూస్‌ఆన్ ఎయిర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే ప్రపంచంలో ఎక్కడున్నా ఆకాశవాణి ప్రసారాలను వినవచ్చన్నారు. శ్రోతలు మెచ్చే కార్యక్రమాలను మార్కాపురం ఆకాశవాణి కేంద్రం వారు ప్రసారం చేస్తుండటం పట్ల సిబ్బందిని, ప్రోగ్రాం హెడ్ ప్రశాంత్ కిరణ్‌ను అభినందించారు. విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారు ఆకాశవాణి కార్యక్రమాలు వినాలన్నారు. వివిధ రకాల ప్రసార మాధ్యమాలు వచ్చినా ఆకాశవాణి ప్రాధాన్యత ఏ మాత్రం తగ్గలేదన్నారు.

ప్రత్యేక శుభాకాంక్షలు:

మార్కాపురం ఆకాశవాణి ఏర్పాటై 30 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని శ్రోతలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. మార్కాపురం ఆకాశవాణి కేంద్రం ద్వారా మంచి కార్యక్రమాలు ప్రసారమవుతున్నాయని, తాను కారులో కూర్చుని వెళ్లే సమయంలో కచ్చితంగా ఈ కేంద్ర ప్రసారాలను వింటానని తెలిపారు. అనంతరం మంగళవారం 'సాక్షి'లో మార్కాపురం ఆకాశవాణి కేంద్రంపై "వినిపించి..మైమరపించి" కథనాన్ని చదివి మంచి స్టోరీని ప్రచురించినందుకు సాక్షి సిబ్బందిని అభినందించారు. స్టేషన్ డిప్యూటీ డైరెక్టర్ సుభాష్, ప్రోగ్రాం హెడ్ ప్రశాంత్ కిరణ్, జీ.దివ్య, ట్రాన్స్‌మిషన్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ సీహెచ్ మాణిక్యరావు, సిబ్బంది మంత్రికి ఘన స్వాగతం పలికి సన్మానించారు.



మాట్లాడుతున్న మంత్రి సురేష్

ఉపకార వేతనాలకు రెన్యువల్ చేసుకోవాలి

ఒంగోలు: జిల్లాలో మెట్రిక్ అనంతర ఉపకార వేతనాలకు అర్హత కలిగిన విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరానికి జగన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన పథకాలను పొందేందుకు కళాశాలల యాజమాన్యాలు సెప్టెంబర్ 10వ తేదీ లోగా జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో రెన్యువల్ రిజిస్టర్ చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డు కులాల సంక్షేమ సాధికారత అధికారి ఎన్.లక్ష్మానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని కాలేజీల యాజమాన్యాలు వారి లాగిన్‌లో రెన్యువల్ రిజిస్ట్రేషన్‌కు ప్రతి విద్యార్థికి సంబంధించిన 5 సంవత్సరాల 2017-18 నుంచి 2021-22 కాలేజీ అకడమిక్ పెర్ఫార్మెన్స్ నమోదు చేయాలన్నారు. అలా నమోదు చేయని పక్షంలో విద్యార్థినీ విద్యార్థులకు రెన్యువల్ జరగదన్నారు. కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాళ్లు విద్యార్థులు అందించిన సమాచారాన్ని జ్ఞానభూమి కాలేజీ లాగిన్‌లో అప్‌డేట్ చేయాలని కోరుతున్నామన్నారు. విద్యార్థులు తమ కళాశాలకు వచ్చి కళాశాల జ్ఞానభూమి వెబ్‌సైట్ లాగిన్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


వెంకటరెడ్డి మృతదేహం

బేస్తవారిపేట: మండలంలోని చిన్న ఓబినేనిపల్లె సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవేరోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఎంపీచెరువుకు చెందిన మాజీ ఆర్మీ ఉద్యోగి వెంకటరెడ్డి చిన్న ఓబినేనిపల్లెలో పోలేరమ్మ ఆలయంలో బంధువుల శుభకార్యానికి హాజరయ్యాడు. తిరిగి మోటార్‌సైకిల్‌పై బేస్తవారిపేట సమీపంలో బంధువులను వదిలిపెట్టి చిన్న ఓబినేనిపల్లె వెళ్తున్న సమయంలో ఎదురుగా బొలేరో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు అత్యధిక ధర రూ.277


టంగుటూరులో వేలంలో పాల్గొన్న బయ్యర్లు

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం ఒంగోలు రీజియన్‌లోనే ఆల్‌టైమ్ గరిష్ట ధర కేజీ రూ.277 పలికింది. తూర్పునాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాల రైతులు 1,201 బేళ్లు తీసుకురాగా 1148 కొనుగోలయ్యాయి. 53 పొగాకు బేళ్లను వ్యాపారులు తిరస్కరించారు. కనిష్ట ధర రూ.162, సరాసరి ధర రూ.262.19 పలికింది. వేలంలో మొత్తం 38 మంది వ్యాపారులు పాల్గొన్నారని నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

బయోమెట్రిక్ నమోదుకు కొత్త ఆధార్ సెంటర్లు

ఒంగోలు సిటీ: కేంద్ర ప్రభుత్వ (నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్) ప్రీ మెట్రిక్, పోస్టు మెట్రిక్, బేగం హజరత్ మహల్, మెరిట్ కం మీన్స్ స్కాలర్ షిప్ విడుదలకు హెడ్ ఆఫ్ ది ఇన్‌స్టిట్యూట్, ఇన్‌స్టిట్యూట్ నోడల్ ఆఫీసర్లకు దరఖాస్తు చేసిన విద్యార్థులు నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్‌లో బయోమెట్రిక్ నమోదుకు కొత్తగా ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖాధికారి జి.అర్చన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి, జె.పంగులూరు, కొరిశపాడు, సంతమాగులూరు మండలాల విద్యా సంస్థలకు అద్దంకి వీఎల్‌ఈ. సీఎస్‌ఈ ఆధార్ సెంటరును, అలాగే అర్ధవీడు, బేస్తవారిపేట, కంభం మండలాల విద్యాసంస్థలకు కంభంలో ఆధార్ సెంటరు, చీరాల, వేటపాలెం, ఇంకొల్లు, పర్చూరు మండలాల విద్యాసంస్థలకు చీరాలలో, దర్శి, దొనకొండ, కురిచేడు మండలాల విద్యాసంస్థలకు దర్శిలో, గిద్దలూరు, కొమరోలు, రాచర్ల మండలాలకు గిద్దలూరులో, కందుకూరు, వలేటివారిపాలెం, లింగసముద్రం మండలాలకు కందుకూరులో, కనిగిరి, చంద్రశేఖరపురం మండలాలకు కనిగిరిలో, మార్కాపురం, తర్లుపాడు, దోర్నాల, యర్రగొండపాలెం మండలాలకు మార్కాపురంలో, మార్టూరు, యద్దనపూడి మండలాలకు మార్టూరులో, ఒంగోలు, కొత్తపట్నం, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాలకు ఒంగోలులో, పామూరు మండలానికి పామూరులో, పొదిలి మండలానికి పొదిలిలో, సంతనూతలపాడు, చీమకుర్తి, తాళ్లూరు మండలాలకు సంతనూతలపాడులో, సింగరాయకొండ, టంగుటూరు, ఉలవపాడు మండలాలకు సింగరాయకొండలో వి.ఎల్.ఈ సీఎస్‌ఈ ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే 2022–23 సంవత్సరానికి కేంద్రప్రభుత్వ స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసిన విద్యాసంస్థల వారు ముందుగా ఆధార్‌కార్డు జిరాక్సుతో పాటు వారికి 2022–23 సంవత్సరంలో కేటాయించిన ఐడీ, పాస్వర్డ్ తీసుకొని కేటాయించిన వి.ఎల్.ఈ సీఎస్‌ఈ ఆధార్‌సెంటర్లలో ఈ నెల 10వ తేదీ లోపల బయోమెట్రిక్ నమోదు పూర్తి చేయాలన్నారు. అలాగే ఇన్‌స్టిట్యూట్ లాగిన్‌లో వెరిఫికేషన్ కోసం ఉన్న విద్యార్థుల బయోమెట్రిక్ నమోదు కూడా ఈ నెల 15వ తేదీ లోపల చేయాలన్నారు. ముందుగా హెడ్ ఆఫ్ ది ఇన్‌స్టిట్యూట్, ఇన్‌స్టిట్యూట్ నోడల్ ఆఫీసర్లు నమోదు తర్వాత విద్యార్థుల బయోమెట్రిక్ నమోదు చేయాలన్నారు. ఇన్‌స్టిట్యూట్ లాగిన్‌లో దరఖాస్తు పరిశీలన ఈ నెల 20 వ తేదీ లోపల చేయాలన్నారు. వివరాలకు సందేహాలకు ఫోన్: 9951160149, 8688550352 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు

● రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్


ముడివేములలో గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఇంటా సంక్షేమ కాంతులు విరజిమ్ముతున్నాయని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని ముడివేములలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి మేలు చేసేలా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. గత ప్రభుత్వం జన్మభూమి కమిటీల పేరుతో దోచుకున్నాయన్నారు. కానీ తాము పార్టీలకతీతంగా ఇప్పుడు అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తుంటే విమర్శించడం సిగ్గుచేటన్నారు. వలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను ఇంటికే అందిస్తున్నామని తెలిపారు. వలంటీర్ల సేవలకు గుర్తింపుగా వారికి ఏటా ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. వలంటీర్లు అందుబాటులో లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.కిరణ్, ఏఓ కె.నీరజ, ఏపీఓ సుజాత, ఈఓఆర్డీ మురళీమోహన్, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, గ్రామసర్పంచ్ రాధాకృష్ణమూర్తి, ఎంపీటీసీ ఎస్ సుబ్బారావు, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, పార్టీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మల్లికార్జున్, కన్నా, సుబ్రహ్మణ్యం, కోటయ్య తదితరులు ఉన్నారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కుళాయిలను ప్రారంభించారు. ప్రజల సమస్యలను వెంటనే తీర్చేందుకు అధికారులను సురేష్ ఆదేశించారు.

పేదలందరికీ అందుబాటులో ఆరోగ్యశ్రీ


మాట్లాడుతున్న ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేక అధికారి అశోక్‌బాబు


సమావేశంలో పాల్గొన్న ఆరోగ్యమిత్రలు

● ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి డాక్టర్ అశోక్‌బాబు

ఒంగోలు సిటీ: పేదలందరికీ ఆరోగ్యశ్రీని అందుబాటులో ఉంచాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఆరోగ్యశ్రీ ప్రత్యేకాధికారి డాక్టర్ యాదాల అశోక్‌బాబు అన్నారు. ఆరోగ్యశ్రీ పథకంపై ఒంగోలు ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం ఆరోగ్యమిత్రలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీకి జన్మనిచ్చింది వైఎస్ రాజశేఖరరెడ్డి అయితే పునర్జన్మనిచ్చింది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆరోగ్యశ్రీని ప్రతి పేదవాడికి అందించారని కొనియాడారు. వైఎస్సార్ మరణానంతరం 2014 నుంచి 2019 వరకు ఉన్న ప్రభుత్వం ఆరోగ్యశ్రీని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. గత ప్రభుత్వం పేదలకు వైద్యం అందించకుండా ఆరోగ్యశ్రీ హాస్పిటల్స్‌కు నిధులు కేటాయించకుండా ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చేసిందని ధ్వజమెత్తారు. 108 వాహనాలను ఆపదలో ఉన్న వారి చెంతకు వెళ్లలేని పరిస్థితికి తీసుకువచ్చి మూలనపడేలా చేశారన్నారు. కానీ ఇప్పుడు మళ్లీ మాయమాటలతో ప్రజలను మోసం చేసేందుకు రోడ్లపైకి పాదయాత్రల పేరుతో వస్తున్నారన్నారు. పేదలకు నాణ్యమైన వైద్యం అందించలేని దిక్కుమాలిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే అది గత టీడీపీ ప్రభుత్వమేనన్నారు. టీడీపీ హయాంలో వైద్య సిబ్బందిని నియమించకుండా పేదల ఆరోగ్యంతో చెలగాటమాడారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీని పేదలందరికీ అందుబాటులోకి తెచ్చారన్నారు. ఆరోగ్యశ్రీకి ఎంత ఖర్చయినా వెనకాడకుండా బలోపేతం చేశారన్నారు. పేదలకు నాణ్యమైన కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందన్నారు. గత ప్రభుత్వంలో 1059 వ్యాధులకు మాత్రమే చికిత్స చేశారని, కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 3257 వ్యాధులను ఆరోగ్యశ్రీలో చేర్చారన్నారు. ఆరోగ్యశ్రీలో ఇప్పటి వరకు 40 లక్షల మందికి పైగా ఉచిత వైద్యం పొందారన్నారు. ఇప్పటి వరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీకి రూ.3400 కోట్లు ఖర్చు పెట్టారన్నారు. రాష్ట్రంలో 2,64,000 మంది క్యాన్సర్ వ్యాధికి చికిత్స పొందారని రూ.1800 కోట్లు క్యాన్సర్ వ్యాధికి కేటాయించినట్లు వివరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి మేనేజర్ కిరణ్‌కుమార్, టీం లీడర్లు నారాయణ, రత్నం, ఝాన్సీ, పీరారెడ్డి, ఆరోగ్యమిత్రలు పాల్గొన్నారు.

బోధనా సామగ్రితో దివ్యాంగులకు మేలు

● ఆర్‌జేడీ వీఎస్ సుబ్బారావు


దివ్యాంగులకు బోధనా సామగ్రి పంపిణీ చేస్తున్న ఆర్జేడీ సుబ్బారావు తదితరులు

ఒంగోలు: మేధో వికాసంలో వెనుకబడిన దివ్యాంగులకు సరఫరా చేసే బోధనా సామగ్రి వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని ఆర్‌జేడీ వీఎస్ సుబ్బారావు పేర్కొన్నారు. బోధనా సామగ్రిని తల్లిదండ్రులు సక్రమంగా వినియోగించడం ద్వారా సాధారణ పిల్లల్లా విద్యాబుద్ధులు నేర్చుకోగలుగుతారని చెప్పారు. మంగళవారం స్థానిక సమగ్రశిక్ష కార్యాలయం సమావేశ మందిరంలో సికింద్రాబాద్ నిపిడ్, నెల్లూరు సీఆర్‌సీ సహకారంతో మానసిక వైకల్యంతో బాధపడే దివ్యాంగులకు బోధనా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు భగవంతుని ప్రతిరూపాలని, దివ్యాంగులపై తల్లిదండ్రులు మరింత ప్రేమ, శ్రద్ధ కనబరచాలన్నారు. వారి సంరక్షణకు, మేధోభివృద్ధికి టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కిట్లు ఉపకరిస్తాయన్నారు. జిల్లాలోని 38 మండలాల్లో గల దివ్యాంగులకు 160 కిట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. వీటిని 8, 9వ తేదీల్లో రెండు విడుతలుగా పంపిణీ చేస్తున్నామన్నారు. నిపిడ్ సంస్థ ప్రత్యేక అధికారిణి డాక్టర్ సునీతదేవి మాట్లాడుతూ.. దివ్యాంగుల జ్ఞాన రంగానికి సంబంధించిన సమస్యలను టీఎల్‌ఎం కిట్లలోని సామగ్రితో అధిగమించవచ్చన్నారు. నెల్లూరు సీఆర్‌సీ ప్రతినిధి సి.జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. కిట్లలో ఉన్న మెటీరియల్‌ను ఎలా వినియోగించాలనే దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సహిత విద్య ఇన్‌చార్జి కోఆర్డినేటర్ ఎం.రమేష్, ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఏఎస్‌ఓ అంజిరెడ్డి, జిల్లాలోని 15 మండలాల నుంచి వచ్చిన దివ్యాంగులు, వారి తల్లిదండ్రులు, సహిత విద్య రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

పీజీ పరీక్షలో మెడికోల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఒంగోలు సిటీ: పీజీ పరీక్షలో ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఫార్మకాలజీ విద్యార్థి డాక్టర్ ఎస్.విద్యాలక్ష్మి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌బాబు తెలిపారు. మంగళవారం కళాశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. మైక్రోబయాలజీలో డాక్టర్ వి.జగన్, డాక్టర్ జేవీ వినయ్, డాక్టర్ టి.మౌనిక, ఫార్మకాలజీలో డాక్టర్ ఎస్.గౌతమ, డాక్టర్ ప్రసన్న ప్రథమ శ్రేణిలో మార్కులు సాధించి సత్తా చాటారని వెల్లడించారు. ఈ ఘనత తమపై మరింత బాధ్యతను పెంచిందని పేర్కొన్నారు. ప్రొఫెసర్లు, సిబ్బంది సహకారంతో ఉత్తమ వైద్యులను తీర్చిదిద్దగలుగుతున్నామన్నారు.

10న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు

ఒంగోలు: 2023–24 విద్యా సంవత్సరానికి ప్రతి అసెస్‌మెంట్ అనంతరం విద్యార్థుల ప్రగతిని చర్చించేందుకు ప్రతి పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీఈవో వీఎస్ సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఫార్మేటివ్ 1 అసెస్‌మెంట్ పరీక్ష పూర్తయినందున ఈనెల 10న అన్ని యాజమాన్య పాఠశాలల్లో తల్లిదండ్రులు– ఉపాధ్యాయుల సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. అన్ని సబ్జక్టులకు ఎఫ్ఏ 1 జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి మార్కులు సిద్ధం చేసి ఉంచుకోవాలన్నారు. సమావేశం ఏర్పాటు విషయాన్ని అజెండా అంశాలతో పాటు తల్లిదండ్రులందరికీ ముందుగానే రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. తల్లిదండ్రులంతా హాజరయ్యేటట్లు చూడాలని, పాఠశాల నిధుల నుంచి సమావేశం నిర్వహణకు అయ్యే ఖర్చును భరించాలన్నారు. అదే విధంగా ఫొటోలను ఐఎంఎంఎస్ యాప్‌లోని జనరల్ ఫొటో కాప్చర్ అదర్స్ ఆప్షన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

దమ్ముంటే చర్చకు రండి

● గుండ్లకమ్మ ప్రాజెక్టుపై టీడీపీ నేతలకు ఎమ్మెల్యే టీజేఆర్ సవాల్
● మరమ్మతు నిధులు మొక్కల పేరుతో మెక్కింది పచ్చ నేతలేనని ధ్వజం
● టీడీపీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంపై నిలదీత
● అన్నదాతలను ఆదుకుంది సీఎం వైఎస్ జగనేనని స్పష్టీకరణ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

ఒంగోలు: సింగడు అద్దంకి పోను పోయాడు.. రానూ వచ్చాడు అన్న చందంగా మొన్న లోకేష్, నిన్న చంద్రబాబు ప్రకాశం జిల్లా పర్యటనకు వచ్చి వెళ్లారని సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు ఎద్దేవా చేశారు. టీడీపీ జమానాలో గుండ్లకమ్మ ప్రాజెక్టు పరిస్థితి, చేసిన వ్యయం, ప్రాజెక్టు కింద ఎంత ఆయకట్టుకు నీరిచ్చారు తదితర వివరాలపై గణాంకాలతో సహా చర్చకు రావాలని చంద్రబాబు, లోకేష్ లేదా టీడీపీ నేతలకు సవాల్ విసిరారు. మంగళవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతిసారీ ఆరోపణలు గుప్పించి పారిపోవడం కాదని, దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది, ఆ ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేసింది ఎవరో స్పష్టంగా తెలుసుకోవాలన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో గుండ్లకమ్మలో నీటిని నిల్వ చేయకపోవడంతో దిగువ భూములన్నీ బీడువారాయన్నారు. మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లోని పండ్ల తోటల రైతులు నీరు వదులుతారా.. ప్రాజెక్టు గేట్లు ధ్వంసం చేయమంటారా అంటూ ఆనాడు హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆయకట్టు భూములకు సాగునీరు అందిస్తూనే ఉన్నామన్నారు. కనపర్తి లిఫ్టు ఇరిగేషన్ స్కీమ్ చంద్రబాబు హయాంలో పూర్తిగా మూతపడితే తమ హయాంలో ఏటా 1.50 లక్షల క్వింటాళ్ల చొప్పున నాలుగేళ్లలో 6 లక్షల క్వింటాళ్ల ధాన్యాన్ని రైతులు పండించుకోగలిగారన్నారు. ప్రాజెక్టు గేట్ల మరమ్మతులకు, గ్రీజు వేసేందుకు రూ.3 కోట్లు కేటాయిస్తే వాటన్నింటినీ మొక్కల పేరుతో టీడీపీ నేతలు మెక్కేశారని దుయ్యబట్టారు. చంద్రబాబు హయాంలో నీరు లేకపోవడంతో గేట్లు ఉన్నా ఒకటే లేకపోయినా ఒకటే అన్నట్లు వదిలేశారని, ప్రస్తుతం నీరు సమృద్ధిగా వస్తుండటంతో నాటి నిర్లక్ష్యానికి నేడు రైతులు ఫలితం అనుభవిస్తున్నామన్నారు. రెండు గేట్ల మరమ్మతులు పూర్తయ్యాయని, ఇంకో గేటు పని సాగుతోందని, ప్రాజెక్టులో 1.7 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

నాటి హామీలు గుర్తున్నాయా బాబూ..

లోకేష్ పర్యటన సమయంలో అద్దంకి, చీరాల, పర్చూరు, ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాలన్నీ కలిపి 3 వేల మంది, చంద్రబాబు పర్యటనకు పట్టుమని 2500 మంది కూడా లేకపోవడం టీడీపీ స్థితి ఏమిటో స్పష్టం చేస్తోందన్నారు. 2014 ఎన్నికల వేళ రూ.86 వేల కోట్ల రైతుల రుణాలను బేషరతుగా రద్దు చేస్తామన్న చంద్రబాబు ఎందుకు రద్దు చేయలేదని ప్రశ్నించారు. ఒంగోలులో విమానాశ్రయం, రామయపట్నం వద్ద పోర్టు, పేపర్‌మిల్లు, ప్రకాశం పంతులు యూనివర్శిటీ, దొనకొండను పారిశ్రామిక హబ్ ఏర్పాటుపై ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. రూ.5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి కేటాయిస్తానని చెప్పి ఎందుకు అమలు చేయలేదో రైతులకు చంద్రబాబు సమాధానం చెప్పాలన్నారు. చంద్రబాబు జమానాలో శనగలకు ధర లేక కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ ఉంచితే, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్వింటాలుకు రూ.1500 అదనంగా చెల్లించి రైతులను ఆదుకున్నారని, మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించి పొగాకు రైతును ఆదుకున్నది తమ ప్రభుత్వం మాత్రమేనన్నారు. నేడు ఆర్బీకేల్లో ఎరువులు, పురుగుమందులు అందించి రైతులను ఆదుకుంటుంటే.. చంద్రబాబు పాలనలో నకిలీ విత్తనాలు ఇచ్చి రైతుల ఉసురు తీశారని దుయ్యబట్టారు. పచ్చ నేతలు ఎన్ని కారుకూతలు కూసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ దుందుభి మోగించడం ఖాయమన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ పరిశీలకుడు భవనం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వంపై బురద జల్లేందుకే ప్రతిపక్ష నేత చంద్రబాబు కార్యక్రమాలు నిర్వహిస్తుండడం శోచనీయమన్నారు. సర్వేలన్నీ వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉంటుండడంతో మానసిక ఒత్తిడి తట్టుకోలేక కార్యకర్తలను రెచ్చగొట్టి భయానక వాతావరణాన్ని సృష్టించేందుకు కుట్రలు పన్నడం దుర్మార్గమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మరోసారి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

కచ్చితత్వంతో స్వమిత్వ సర్వే

● కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్


కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ఒంగోలు సిటీ: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష(స్వమిత్వ) సర్వేను కచ్చితత్వంతో నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై మండల స్థాయి అధికారులతో కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఫైనల్ ఆర్‌ఓఆర్ పబ్లికేషన్‌కు సంబంధించి ఈ–కేవైసీ సర్వే విధానంపై సమీక్షించారు. సర్వేను కచ్చితత్వంతో నిర్వహించి, అభ్యంతరాలు స్వీకరించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని చెప్పారు. స్వమిత్వలో చేసే ప్రతి కార్యక్రమానికి సంబంధిత రిజిస్టర్లు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ.. స్వమిత్వ సర్వేతో గ్రామ కంతంలోని గృహాలకు హక్కు పత్రాలు వస్తాయన్నారు. సదరు ఆస్తులు, స్థలాలు అమ్ముకోవడానికి లేదా వాటిపై రుణాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. గ్రామ, వార్డు సచివలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు ఉదయం, సాయంత్రం కచ్చితంగా వేయాలన్నారు. సేవలకు సంబంధించిన పెండింగ్ నగదును ప్రభుత్వానికి వెంటనే జమ చేయాలని చెప్పారు. సర్వీసులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఏపీఎంల దగ్గర ఉన్న ఓటీఎస్ పెండింగ్ నగదును వెంటనే జమ చేయాలని ఆదేశించారు. ఆధార్ సెంటర్లలో ఉన్న పెండింగ్ నగదును కూడా జమ చేయాలన్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వారాంతపు లక్ష్యాలను కచ్చితంగా సాధించాలన్నారు. పూర్తయిన ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. శుక్రవారం హౌసింగ్ డే కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓ, సంబంధిత అధికారులందరూ పాల్గొని లేఔట్లలో సమస్యలు పరిష్కరించాలని, లబ్ధిదారులందరూ ఇళ్లు నిర్మించుకునేలా ప్రోత్సహించాలని దిశానిర్దేశం చేశారు. రివైజ్డ్ రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌కు సంబంధించిన అంచనాలను పంపించాలని చెప్పారు.

ఉపాధి హామీ పనులపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఓ వెంకటేశ్వర్లు, డీపీఓ నారాయణరెడ్డి, హౌసింగ్ పీడీ పేరయ్య, జీఎస్‌డబ్ల్యుఎస్ నోడల్ అధికారి ఉషారాణి, ఇరిగేషన్ ఎస్‌ఈ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రపంచ ఆదివాసి దినోత్సవం

యర్రగొండపాలెం: ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా పెద్దదోర్నాలలోని బొగ్గరపు సత్యమాంబ కల్యాణ మండపంలో బుధవారం కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఐటీడీఏ పీఓ బి.రవీంద్రరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారన్నారు. ఆయా ప్రాంతాల్లోని చెంచు గిరిజన నాయకులు పాల్గొని ఆదివాసి దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు


బ్యాంకు అధికారులు, సిబ్బందిని సన్మానిస్తున్న జేసీ శ్రీనివాసులు, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సిటీ: పీఎం స్వనిధి పథకం ద్వారా వీధి విక్రయదారులు అతి తక్కువ వడ్డీతో సులభంగా బ్యాంకు రుణాలు పొంది ప్రైవేట్ ఫైనాన్షియర్ల నుంచి విముక్తి పొందవచ్చని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. జిల్లా లీడ్‌బ్యాంకు, మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం స్పందన హాలులో పీఎం స్వనిధి కార్యక్రమంపై ఒంగోలు మేయర్ గంగాడ సుజాతతో కలిసి పాల్గొన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ వీధి విక్రయదారులు ఏటా వీధి విక్రయదారుల కార్డులను తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని తెలిపారు. కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బ్యాంకు ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులు సకాలంలో రుణాలను చెల్లించి బ్యాంకు వారికి సహకరించాలని కోరారు. అనంతరం బ్యాంకు నుంచి రుణాలు పొంది తిరిగి చెల్లించిన విక్రయదారులకు, అధిక రుణాలు మంజూరు చేసిన బ్యాంకు అధికారులు, మెప్మా సిబ్బందిని సన్మానించారు. ఎల్‌డీఎం అబ్దుల్ రహీం, మెప్మా పీడీ రవికుమార్ పాల్గొన్నారు.

తీరంలో సోనాబోట్ల హల్‌చల్!


ఊళ్లపాలెం వద్ద తీరానికి దగ్గరగా చేపల వేట సాగిస్తున్న సోనాబోట్లు

సింగరాయకొండ: మండలంలోని పాకల, ఊళ్లపాలెం తీరంలో మంగళవారం తమిళనాడు రాష్ట్రం కడలూరుకు చెందిన సోనాబోట్లు హల్‌చల్ చేశాయి. సుమారు ఏడుకు పైగా బోట్లు తీరానికి అతి దగ్గరగా చేపల వేట సాగించాయి. వేటపై నిషేధం ఎత్తివేత అనంతరం వరుసగా అల్పపీడనాలు, వాయుగుండాలు ఏర్పడటంతో వేట సక్రమంగా సాగక మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నష్టాలు భరించలేక కొద్ది రోజులపాటు వేటకు స్వచ్ఛంద విరామం కూడా ఇచ్చారు. ఇప్పుడిప్పుడే మత్స్య సంపద లభిస్తున్న తరుణంలో సోనాబోట్లు మళ్లీ రావడంతో నిశ్చేష్టులయ్యారు. ఇటీవల కలెక్టర్ దినేష్‌కుమార్ పాకల పర్యటనకు వచ్చినప్పుడు మత్స్యకారులు సోనాబోట్ల విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లగా బోటు నంబర్ గుర్తించాలని చెప్పారు. నంబర్ గుర్తించడం కోసం బోటుకు దగ్గరగా వెళ్తే తమిళ జాలర్లు తమపై దాడులకు తెగబడతారని స్థానిక మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి సోనాబోట్లు తీరానికి రాకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.